

# నీలి మేఘాలు

కుమారి బోశెట్టి కమలా కౌసల్య

అందమైన సాయంకాలం. అందులోనూ ఆదివారం. సీతాకోక చిలకల్లాంటి అమ్మాయిల్తో పూలతోటలా కళకళలాడి పోతోంది రామకృష్ణా బీచ్.

క్వాలిటీ రెస్టారెంట్‌కి కనుచూపు దూరంలో, పువ్వెత్తున లేచి పడుతోన్న కెరటాల్ని చూస్తూ ఒంటరిగా, పరాకుగా కూర్చుంది జ్యోతి. సముద్రంమీదుగా వస్తూన్న చల్లనిగాలికి ఆమె ఫాలభాగంపై తేలియాడుతూన్న ముంగురులు కెరటాల్ని అనుకరిస్తూన్నట్లున్నాయి. అలా వంటరిగా కూర్చోవడంలో ఏదో దిగులు. ఆ దిగులుతెరె వైనం గుర్తుకువస్తే పుట్టెడు సిగ్గు. ఆ సిగ్గు తెరలలో ఏదో తెలియని వెచ్చటి అనుభూతి.

'నమస్తే!'

హఠాత్తుగా వినిపించడంతో వులిక్కిపడి తల పైకెత్తి చూసింది. నవ్వుల పువ్వులు రువ్వుతూ, ఠీవిగా నిల్చొనివున్న ఆకర్షణీయమైన విగ్రహం కన్పించింది. చిలిపిగా చూస్తోన్న కళ్లు, కొంటెగా నవ్వుతూన్న పెదాలు, తెల్లని టెర్లిన్ స్లాక్, నల్లని పేంట్, దాంతో పోటీ పడుతూన్నట్లుగా నిగనిగ లాడుతోన్న నల్లటి బూట్లు.

'ఎవరో అపరిచితుడు' అనుకోబోయింది జ్యోతి. కానీ ఆమె మనస్సుమాత్రం ఏదో సంఘటనను గుర్తు చేయడానికి ప్రయత్నించ సాగింది. అంతలో అతనే అన్నాడు.

'గుర్తులేనాండీ!' అని.

తన మతిమరపు తనానికి సిగ్గుపడుతూ, ఎదురుగా నిల్చొనివున్న 'గుమ్నామ్'ని గుర్తు తెచ్చుకోవడానికి గట్టిగా ప్రయత్నించింది. ఆమెదృష్టి ఒక వస్తువుమీద పడింది. ఆమె కళ్లు మెరిసాయి. 'అవును! అదే! అదే హేంకీ! బ్లూ హేంకీ! రెండంగుళాల పొడవున అతని జేబులోనుండి తొంగిచూస్తూ వుంది'

అప్పటివరకూ అస్పష్టంగావున్న పాత సంఘటన కళ్లముందు కదలాడింది.

* * *

మూడునెల్ల క్రితం పిన్నిని చూడాలని హైద్రాబాదు వెళ్లింది తాను.

ఓరోజు సాయంత్రం......

ఉరుముల నాదాలతోడుగా అప్పటివరకూ నృత్యంచేసి అలసిపోయిన వర్షం వెలిసిపోయి, భూమిమీద ఏళ్లరూపంలోనూ సెలయేళ్ల రూపంలోనూ సముద్రుడిలో కలవడానికి పరుగులుతీయ నారంభించింది. అంతవరకూ నల్లగా, విషాదానికి మారురూపంలా వికృతంగా వున్న మేఘాలు, తెల్లగా, దూదిపింజల్లా మనోహరాకృతుల్ని సంతరించుకొంటున్నాయి. ప్రియురాలి హృదయంలా తూర్పుదిక్కున హరివిల్లు విరిసింది.

పిన్నికూతురు రాధను తోడు తీసుకొని షాపింగ్‌కని బయల్దేరింది జ్యోతి. కోఠి దగ్గర బస్‌దిగి నడుస్తూవుండగా హఠా

త్తుగా ఏవరోమనిషి ఆమెకు డాష్ యివ్వడం, ఆమె తూలి పడబోయి, నిలద్రొక్కుకోవడం రెప్పపాటులో జరిగాయి. పశ్చిమ దిక్కున ప్రకాశిస్తూన్న అరుణకాంతి ఆమె కళ్లల్లో చోటు చేసుకొంది. తడబాటు నుండి తేరుకొని చూసేసరికి చెట్టంత మనిషిని పట్టుకొని చెడామడా దులిపేస్తోన్న రాధా, బిక్కమొహం వేసుకొని, అపరాధిలా చూస్తోన్న అందమైన అబ్బాయిూ కన్పించారు. అతను పాపం! చాలా దీనంగా 'సారీ' చెప్పుకొంటున్నాడు. ఐనా రాధలో ఏమాత్రం కనికరం కనిపించడంలేదు.

'పాపం! చూసుకొని వుండడు!' నిజం చెప్పాలంటే తనుకూడా చూసుకోకుండా నడిచింది. తప్పంతా అతనిదే అయినట్లు రాధ మాట్లాట్టం జ్యోతికి నచ్చలేదు. పైగా అతనిమీద ఆక్షణంలో బోలెడు జాలివేసింది కూడాను.

'ఊరుకోవే! ఏదో జరిగిపోయింది' అంది జ్యోతి రాధ చేయిపట్టుకొని లాగుతూ. అతనిముఖంలో కోటిదీపాలు వెలిగాయి. ఆగిపోయినరాధ వాగ్ధాటిని తలచుకొంటూ—'చాలా థ్యాంక్సండీ!' అన్నాడు జ్యోత్తో.

రాధ చేయిపట్టుకొని ముందుకు పోబోయిన జ్యోతి 'మిస్! ప్లీజ్' అని వినిపించడంతో 'మళ్లీ ఏం జరిగిందిరా బాబూ!' అనుకుంటూ వెనక్కుతిరిగి చూసింది. అతను బిక్కముఖం వేసుకొని ఆమె కుడిచేతివైపు చూస్తున్నాడు. అతనికి మొహం అలాపెట్టడం అలవాటేమో అనుకుంటూ, అతని చూపుల ననుసరించి చూసిన జ్యోతి సిగ్గుపడింది. ఆమె చేతికున్న పొళ్లగాజుకు దారప్పోగు చిక్కుకొని వ్రేలాడుతూ కన్పించిందో చక్కని బ్లూహేండ్ కర్చీఫ్.

'సారీ!' అంటూ పొళ్లనుండి తప్పించి ఆ రుమాల్ని అతని చేతికిచ్చింది.

'ఫరవాలేదండీ, మరోమారు థ్యాంక్స్' అంటూ అతను ముందుకు కదిలాడు.

'ఫర్వాలేదు, ఏమో అనుకున్నాను! గట్టిదానివే!'—ఎగతాళి పట్టించబోయింది రాధ.

'చాల్లే! నోర్మూసుకో!' అంది జ్యోతి వస్తూన్న నవ్వును ఆపుకోలేక నవ్వేస్తూ.

* * *

'గుర్తు వచ్చారండీ! నమస్తే!' అంది చేతులు జోడిస్తూ. ఆమె చూపులు తన హేండ్కర్చీఫ్పై వుంటం గమనించి, అతనుకూడా ఓసారి దానివంకచూసి నవ్వుకున్నాడు.

'మీ ఏకాంతానికి భంగం కలిగించాననుకొంటాను. క్షమార్హుడి నేనా?'—ఆమెకు నాలుగడుగుల దూరంలో కూర్చుంటూ అడిగాడు.

'అర్హులే' అంది జ్యోతి తలదించుకుని.

'థేంక్స్!' అన్నాడతను.

కాస్సేపు నిశ్శబ్దం నిశ్శబ్దంగా నృత్యం చేసింది.

'మీ పేరు తెలుసుకోవచ్చా!' నిశ్శబ్దం చీలిపోయింది.

'తెలుసుకోవచ్చు' సముద్రపు టంచుల్ని చూస్తూ జవాబిచ్చింది.

కెరటాలమీది నురగలా అతని ముఖం తెల్లబడింది. ఆ తర్వాత చుట్టూ వ్యాపిస్తోన్న చీకటిలా నల్లబడింది. అతని ముఖంలోని మార్పుల్ని గమనించిన జ్యోతి నొచ్చుకొంటూ,—'జ్యోతిర్మయి' అని చెప్పింది.

'వెరీ బ్యూటిఫుల్ నేమ్! నాపేరు ప్రసాద్' ఆమె అడక్కపోయినా ఆత్మపరిచయం చేసుకున్నాడు.

'అందంగా మాట్లాడుతాడు'—మనస్సులోనే అనుకొంది జ్యోతి.

ఏదో అడగాలని — ఆమెను మాట్లాడించాలని ప్రసాద్ మనస్సు పరవళ్లు త్రొక్కుతూంది. కాని ఆమె ఏదో తపస్సులో వున్నట్లుగా కనిపించడంతో, చేసేదేమీలేక, యిసుకలో ఆమె బొమ్మ గీయసాగాడు.

పావుగంట గడిచింది. ఆమె తల త్రిప్పింది.

'వెళ్లిపోతుంది కాబోసు' అనుకున్నాడు ప్రసాద్.

'గుడ్ నైట్!' అందామె పైకిలేస్తూ.

'వీణ మీటినట్లుంది'— అనుకున్నాడు.

మల్లెతీగలావున్న జ్యోతిని చూస్తూ, 'మీకు అభ్యంతరం లేకపోతే రేపుకూడా-'

'బావుందండోయ్ మీ అభ్యర్ధన! మీరు రమ్మన్నా, అనకపోయినా రోజూ వచ్చి యిక్కడ యిలా కూర్చోవడం నా కలవాటు. అసలు ఇక్కడకెవ్వరూ రారు. మీరెలా వచ్చారో గానీ.'

'మిమ్మల్నిచూసి మీకోసం వచ్చానుల, నా ఐసే గుడ్నైట్'—ఎన్నో యుగాలనాటి అన్వేషణ ఫలించిన తృప్తిని నింపుకున్నాయి అతని కళ్లూ, మనస్సూ.

'అతి చనువు' అనుకోబోయి, తటపటాయించి, మానివేసింది జ్యోతి.

* * *

మర్నాడు ఆమెకన్నా ముందుగా వచ్చి కూర్చున్నాడు ప్రసాద్. అతనువచ్చిన అరగంట తర్వాత ఆమె వచ్చింది. అతను నవ్వాడు, ఆమెకూడా నవ్వింది.

మామూలుగా మాటలు కరువయ్యాయి కాసేపు.

'మీరేం చేస్తున్నారు?' కోకిలారావం వినిపించిందతనికి. అప్పటివరకూ ఆమెనే చూస్తూన్న ప్రసాద్, దొరికిపోయిన వాళ్లా చూపులు త్రిప్పుకొని, 'మిమ్మల్ని చూస్తున్నాను' అన్నాడు నెమ్మదిగా.

వచ్చేనవ్వుని ఆపుకొంటూ 'కనబడుతూనే వుంది. ఇప్పుడేం చేస్తున్నారని కాదు నేనడిగింది. అసలేం జేస్తుంటారూ అని' అంది జ్యోతి.

'అన్వేషిస్తూ వుంటాను'

'ఎవర్ని?'

'ఎవర్నికాదు దేన్ని అనాలి' కొంటెగా చూస్తూ అన్నాడు ప్రసాద్. జ్యోతిముఖం ఎఱ్ఱబడింది కోపంతో. అది గమనించిన ప్రసాద్ లోలోన నవ్వుకొంటూ, 'ఉద్యోగాన్వేషణ చేస్తున్నాను' అని చెప్పాడు.

'ఏం చదివారో తెలుసుకోవచ్చా!'

'నిరభ్యంతరంగా! ఏం వుద్యోగమేదైనా యిస్తారా?'

జ్యోతిముఖం మళ్లీ సంధ్యారుణిమ పులుముకొంది. కానీ యీసారి కోపంతో కాదు. నిన్నటి తన ప్రవర్తన గుర్తుకు రావడంవల్ల కలిగినసిగ్గులో, ఆమె సన్నగా నవ్వింది. అందం విరగబడి నవ్వింది.

'ఎమ్మెస్సీ! మరి మీరేం చదువుతున్నారు?'—ఆమె బుగ్గలపై పూచిన రోజా మొగ్గలను చూపులతో ఏరుకొంటూ అడిగాడు.

'సెకండ్బియ్యే. మీదీ వూరేనా!'

'కాదు మొదటిసారిగా మీకు ఎక్కడ కన్పించానో అదే మావూరు' జ్యోతి కనుబొమ్మలు ఆశ్చర్యార్ధకంగా కొంచెం పైకి లేచాయి.

'మీరంతగా ఆశ్చర్యపడకండి. ఉద్యోగం కోసం తిరుగుతున్నానని చెప్పాను కదూ! లా తిరుగుతూ యిలా మీ వూరు

వచ్చాను. ఉద్యోగం దొరుకుతుందో లేదో తెలీదు కానీ అంతకన్నా విలువైనదే దొరికింది.

మాటలు ఆగిపోయాయి. ఇసుకలో పిచ్చి గీతలు గీయటం మొదలుపెట్టింది జ్యోతి. నీలిమబ్బులు తేలియాడుతూన్న ఆమె కళ్లనూ, పొడుగ్గావుండి పైకి వంపు తిరిగివున్న ఆమె కనురెప్పల్నీ, తేనెలూరుతూన్న పెదాల్నీ చూస్తూ 'బాపూ బొమ్మకన్నా బావుంది' అనుకున్నాడు ప్రసాద్. మధ్యలో తల పైకెత్తిచూసిన జ్యోతి అతని చూపుల తాకిడికి తట్టుకోలేక సముద్రంవైపు చూసింది.

సందెవెన్నెలలో సముద్రం పువ్వుల రూపం ధరించింది. తెలిమబ్బు పొత్తిళ్లలో వున్న బాలరాజు కంటికి కనిపించక పోయినా, చుట్టూవున్న కలికి వెన్నెలలు మాత్రం కళ్లకు కొటుక బెడ్తున్నాయి.

'ఇక వెళ్దామా!' అంటూ పైకి లేచింది.

'అప్పుడే!' అంటూ తనుకూడా లేచాడు ప్రసాద్.

'ఆలస్యమైతే యింటిదగ్గర ఎదురుచూస్తుంటారు'

'ఎవరు?' ఆత్రుత ధ్వనించింది.

'మా పేరెంట్స్'

'అదృష్టవంతుణ్ని' చిన్నగా గొణుక్కున్నాడు ప్రసాద్.

# నీలికుసుమాలు

జ్యోతి నవ్వుకొంది.

ఇసుకలో ఆమె ప్రక్కనే నడుస్తూ ప్రసాద్ 'మీతో ఒకటి చెప్పాలి! అహఁ! మిమ్మల్ని ఓమాట అడగాలి' అన్నాడు తడబడుతూన్న గొంతుకతో. ఏదో అర్థింపు ధ్వనించింది.

'ఏమిటది?' జ్యోతిగొంతు కొంచెం వణికింది. వాచి చూసుకున్నాడు ప్రసాద్. ఏడున్నరైంది. ఇసుకను వదిలి తారురోడ్డు మీదకు వచ్చారు. తల పైకెత్తి చుట్టూ చూసిన అతనికి చాలామంది నడుస్తూ కన్పించారు.

'ప్లీజ్! రేపు చెబ్తాను. ఏమీ అనుకోకండి. గుడ్‌నైట్' అనేసి గబగబా వెళ్తూన్న అతన్నిచూస్తూ 'చాలా వింత మనిషి' అనుకొంది జ్యోతి.

ఇల్లుచేరిన జ్యోతి సరాసరి డాబాపైకి పోయి కూర్చుంది. ఆమె మనస్సు గగన కుసుమాలతో మాలలల్లుకొంటూ గాలి కల్పనలతో కాలయాపన చేయసాగింది. కల్పనా వసంత పవనాలామె దేహాన్ని మృదువుగా స్పృశించసాగాయి.

'రేపు ఏం చెబ్తాడో! అతను చెప్పే విషయమేమిటి? ఎందుకలా తడబడ్డాడు! అతనికీ యిలాటి అనుభవం యిదేమొదటిసారి కాబోలు! ఆ చిన్నకళ్లలో ఎంత ఆకర్షణ. కొంచెం లావుగావున్న పెదవులలో ఎంత పట్టుదల. ఆ అందమైన ముఖంలో ఎంత గాంభీర్యం. అతను నిండుగా పకపకా నవ్వితే ఎలా వుంటాడు —వూహించుకొంది జ్యోతి. 'అబ్బే! బావోలేదు. విలన్లావున్నాడు. ఇలా ఎప్పటిలానే చిర్నవ్వు నవ్వితేనే బావుంటాడు.'

ఆలోచనలతో మనసంతా గజిబిజిగా తయారైంది. నెల్లాళ్ళక్రితం రాధ వ్రాసిన వుత్తరంలోని ఓ విషయం గుర్తుకు వచ్చింది. 'హేండ్కర్చీఫ్ ఎత్తుకుపోయే నీ వైనం గుర్తొచ్చినప్పుడల్లా నవ్వొస్తూంటుంది' అని వ్రాసింది రాధ. 'ఏమిటా సంఘటన! ఏమిటీ సంగమం! ఇది దేనికి నాంది ప్రస్తావన!' హృదయం బరువెక్కింది.

'రేపు! రేపునస్తుంది. అతను వస్తాడు. ఏదో చెబ్తాడు. తను వినాలి! తనూ ఏదో చెప్పాలి! ఆ తర్వాత...'

మనస్సు అనే ప్రమేయం లేకుండానే పిచ్చిగా ఆలోచిస్తూంది. ఆ ఆలోచనల నుండి తప్పించుకోవడానికి ప్రయత్నిస్తూ గట్టిగా నిట్టూర్చి, చుట్టూ చూసింది.

డాబామీదా, చుట్టూ, మసకవెన్నెల. ఇందాక బీచ్‌లో తమ యిద్దరిముందూ నవ్వుతూ నిల్చిన చందమామ యిప్పుడు కొబ్బరిచెట్ల మధ్యనుండి తనను దొంగ చూపులు చూస్తున్నాడు. పట్టుబడిన చందమామ విధిలేక కొబ్బరాకుల చాటు నుండి పైకివచ్చాడు. నేలమీద నిద్రబోతూన్న వెన్నెలకు మెలకువ వచ్చి వొళ్ళు విరుచుకొంది.

చల్లని చందమామతో అంతకన్నా చల్లగా నవ్వుతూ కన్పించాడు ప్రసాద్. గిలిగింతలు పెట్టినట్లైంది.


'జ్యోతి! జ్యోతీ!' — క్రిందనుండి వాళ్లమ్మగారి పిలుపు వినిపించటంతో అందాల బొమ్మ కాస్తా అదృశ్యమై పోయింది.

'ఏమిటమ్మా' — అంటూ క్రిందకు వెళ్లింది జ్యోతి.

'అన్నం తినవా!'

'ఆకలిగా లేదమ్మా!' తన గదిలోకి వెళ్తూన్న జ్యోతి వంక ఆశ్చర్యంగా చూస్తూ నిలబడ్డారు వాళ్లమ్మగారు.

'అమ్మడూ!'— మంచంమ్మీద పడుకొని



# తెల్ల మచ్చలు

ఇదికూడా తెల్లమచ్చలను పోగొట్టుటలో ఇతర మందులకు సమానమేనని మీరు నిస్పృహ చెందేటట్లయితే వెంటనే మాకు శాంపిల్ నకై వ్రాయండి. లాభం పొందినతర్వాతనే డబ్బు పంపండి. నమ్మకంలేనివారికి ఫార్ములా మాత్రమే పంపెదము. ఉచితంగా ఇస్తామనే ఆకర్షణీయమైన ప్రకటనలు చూచి మోసపోవద్దు.

Western India Co., (V·N)
P.O. Katri Sarai (Gaya)

## కావలెను

జపాన్ ఆర్టు చీరలు, టెరిలిన్ సూటింగులు, రెడీమేడ్ ఉడుపులు, శాల్వాలు, నైలాన్ సాక్సు, వగైరాలకు ఆర్డర్లు పొందుటకై నెలకు రు. 650 జీతముపై లేక మంచి కమిషన్ పద్ధతిమీద సేల్సుమెన్ కావలెను. శాంపిల్సుకు వ్రాయండి.

FOREIGN AGENCIES (66)
Post Box 1456, Delhi—6.

వాయిదా చెల్లింపు పద్ధతిన నెలకు రు. 10 కట్టి ట్రాన్సిస్టర్ పొందండి!



World Famous Powerfull

"నేషనల్ 70" సరికొత్త ఒసాకా మోడల్ ఆకర్షణీయమైనది, హామీ గలది. డయల్ లైటుగల ఆల్ వరల్డ్ 3 బ్యాండ్ ట్రాన్సిస్టర్. ప్ర) గ్రామానికి పట్టణానికి పంపగలం. తెప్పించండి.

WRITE YOUR LETTER TODAY
MUSIC & SOUND (N)
P BOX 1576, DELHI 6

# తెల్లవెంట్రుకలుండవు

పొగడడం మాకు ఇష్టంలేదు. కానీ మా "కేశరంజన్" ఆయుర్వేదిక్ సెంటెడ్ ఆయిల్ తెల్ల వెంట్రుకలను నల్లగా మార్చును. మొదట తెల్ల వెంట్రుకలు నల్లవిగామార్చి, అటుపైన నల్లని వెంట్రుకలే వచ్చును. ఈ ఆయిల్ జ్ఞాపకశక్తి, కంటిచూపువృద్ధిపరచును. లాభంపొందినవారు 1000 పైగా మాకు వ్రాసి యున్నారు. లాభం లేకున్న డబ్బు వాపసు. ధర రు. 10/-

Western India Co., (S N.)
P. O. Katri Sarai (Gaya)


# నీలిరంగుకాంతి

ఆలోచిస్తూన్న జ్యోతి నిద్రగా గుమ్మంవైపు చూసి, తండ్రి కనిపించడంతో ఖంగారుగా మంచందిగి నిల్చొంది.

'ఏమ్మా! ఆకలిగా లేదన్నావుట! ఒంట్లో బావోలేదా'—అడిగారాయన.

'బాగానేవుంది నాన్నారూ! కానీ... మరేమో... సాయంత్రం నేను వద్దని ఎంత చెప్పినా వినకుండా ఆ యిందిరా వాళ్ళమ్మగారు యింత టిఫిన్ పెట్టి, అది తినేంతవరకూ వదలమని బలవంతం చేశారు... అందుకని యిప్పుడు ఆకలి వేయడంలేదు'

'పోనీలే! కొంచెం పాలైనా తాగిపడుకో' అంటూ గదిలోకి వెళ్ళిపోయారాయన.

పనిమనిషి పాలగ్లాసు తీసుకొచ్చి టేబిల్ పైన పెట్టి వెళ్ళగానే, గది తలుపులువేసి పాలగ్లాసు చేతిలోకి తీసుకొంది జ్యోతి. ఆమెకళ్ళు ఆశ్చర్యంతో మరింత పెద్దవయ్యాయి. మళ్ళీ ఎప్పించాడు ప్రసాద్. ఎప్పటిలా నవ్వుతూనే వున్నాడు—'అంత తియ్యగా ఎలా నవ్వగలడు'—

'ప్లీజ్! వెళ్ళిపొండి!' బతిమలాడుతూన్నట్లుగా అంది.

'ఊహూఁ!' తల అడ్డంగా త్రిప్పాడు పాలగ్లాసులోని ప్రసాద్.

'వెళ్ళరా!' తర్జని చూపిస్తూ బెదిరించింది

చేతులు కట్టుకొని నిలబడి నవ్వాడు. ఆమె కోపం అలోచించింది.

'సో! ఏసో గుడ్‌నైట్'—నిన్నటి అతని పాట అతనికే అప్పగించి, కళ్ళు గట్టిగా మూసుకొని గ్లాసులోని పాలు గబగబా త్రాగి ఖాళీ గ్లాసులోకి చూసింది — కొంటెగా, అనుమానంగా. అతను కన్పించలేదు నవ్వుకొంటూ లైటార్పి పడుకొంది జ్యోతి.

* * *

బీచ్‌లో ఒంటరిగా కూర్చునివుంది జ్యోతి. మనస్సు వుల్లాసంగా వుంది ఆమె కళ్ళు మెరుస్తున్నాయ్ ఆనందంలో.

'ఇంకా రాలేదేం ప్రసాద్! ఏదో చెబ్తానన్నాడు... ఎప్పుడు వస్తాడు' — ప్రశ్నలతో వేదిస్తూన్న మనసుని వూరడించ ప్రయత్నించింది.

అప్పటి వరకూ పాటిపోయినట్లున్న చందమామ చిటితలలు పరమకోడంతో ప్రకాశించసాగాయి. బీచ్‌లో అక్కడక్కడా ఒంటరిగా మిగిలిపోయి జంటనుగురించి ఆలోచిస్తూన్న వాళ్ళను టెలివిజన్‌లానూ, టెలిగ్రాం మెసెంజర్లానూ, తనకు చేతనైనంతవరకూ సహాయపడుతోన్న చందమామను చూస్తూ,

'ఏచాంద్ జరా ఛుప్‌జా!' కూనిరాగం తీసింది జ్యోతి.

'ఏ వక్త్ జరా రుక్‌జా!'—వెనగా వినిపించింది. తల ప్రక్కకు త్రిప్పి చూసిన జ్యోతికి ప్రసాద్ కన్పించాడు.

'ప్రసాద్! ఎంతసేపైంది మీరువచ్చి?' ప్రక్కనే కూర్చుంటోన్న అతన్నడిగింది జ్యోతి.

'ఎంతచక్కగా పాడావ్ జ్యోతీ!—' ఆమెచేతిని తన చేతిలోకి తీసుకొంటూ అన్నాడు ప్రసాద్. అతనిచనువు ఆమెకు కోపం కలిగించకపోగా ఆనందం కలిగించింది.

'ఊహూఁ; మీరే నాకన్నా చక్కగాపాడారు'

'చందమామ ఎందుకంత చిన్నబోయి వుంది?'

'ఎందుకింత ఆలస్యముంది?'

తమమాటలు ఒకదానికొకటి సంబంధం లేకుండా వున్నాయని గ్రహించిన యిద్దరూ ఒక్కసారిగా నవ్వుకున్నారు.

'జ్యోతీ! అలా చూడు! నీలాకాశం నీలి సముద్రాన్ని చుంబించేచోట చూడు! అక్కడకు పోదాంపద. ఎవ్వరూ వుండరు. ఇంచక్కా నువ్వూ నేనే...' అంటూ ఆమె నడుంచుట్టూ చేయివేశాడు. ఆమె అతని మీద వాలిపోయి, అతని హృదయంలో తలదాచుకొంది. అతను ఏదో చెబుతున్నాడు. ఆమె మరేదో మధురానుభూతిలో సోలిపోయి వింటూంది. ఇద్దరూ సముద్రపు నీటిమీద నెమ్మదిగా నడువసాగారు. వాళ్ళంతఎత్తుగ లేచిన కెరటం ఇద్దర్నీ నీటితెరతో కప్పివేసి, అంతవరకూ వాళ్ళు కూర్చునివచ్చిన ప్రదేశాన్ని పరీక్షించబోయింది.

* * *

ఒళ్ళంతా చల్లబడి క్రింద పడుకున్నట్లు మెలకువ వచ్చింది జ్యోతికి. ఏమిటిది ఏమైంది? ఏమిటీకల? తల వేడెక్కినట్లనిపించింది ఆలోచనలతో. మళ్ళీ నిద్రపోవాలనే ప్రయత్నించి ఓడిపోయిన జ్యోతి లైటువేసి కూర్చుంది.

'ఎందుకు తన మనస్సింత బేలగా తయారైంది! తన మనస్సెందుకిలా ప్రసాద్ వేపు మొగ్గుతుంది! ఇన్నాళ్ళా స్పందన లేకుండా పడివున్న ఆహా శిలలో యింతటి ఆర్ద్రత ఎలా కలిగింది? ఎంతటి ఆకర్షణ

**శక్తి ఆతనిలో!** ఆకళ్ళూ, ఆ పెదిమలూ, ఆ నవ్వూ, ఆ విగ్రహమూ తన నిగ్రహాన్ని చెదరగొడుతున్నాయి. ఇన్నాళ్ళూ సముద్ర తీరాన తను చేసిన మూగతపస్సు ఆ మూర్తి కోసమేనా! ఆతను తనకు కావాలి. తను అతనిలో కలవాలి'—మనస్సు వేయి గొంతులతో అంటోంది 'ప్రసాద్! నువ్వు కావాలి! నువ్వుకావాలి! లేకపోతే నాకు పిచ్చెక్కిపోతుంది ప్రసాద్!' వెచ్చని కన్నీరు ఆమె చెంపలపైకి జారింది.

* * *

ఆరాట పడుతోన్న హృదయాన్ని ఆశా దీపాల్తో వెలిగించుకొని, ఎదురుచూసిన సాయంత్రం రానేవచ్చింది. జ్యోతికి నిరాశను ప్రపంచానికి చీకటిని పంచియిచ్చి వెళ్ళనూ వెళ్ళింది. ఆ మరునటి రోజుకూడా అంతే జరిగింది.

'ఏమైంది అతనికి? వస్తానని చెప్పి ఎందుకు రాలేదు? తనను ఏడిపించటానికా!'

పూజ చేయాలనివచ్చిన పుష్పం వాడి పోయింది. మధుర రాగాలాలపించాలనుకొన్న మహావిపంచి మూగబోయింది. కన్నీరు చెంపల్ని తడిపింది.

* * *

మరునటిరోజు వాడిన ముఖంతో అలి సిన కళ్ళతో కాలేజీకి వెళ్ళింది జ్యోతి. సెకండవర్ క్లాస్ కాన్సిలవడంతో వెయి టింగ్ రూంకి వెళ్తూన్న ఆమెకు గుమ్మం లోనే ఎదురైన కృష్ణవేణి 'ఏమిటే? అలా వున్నావ్! విరహంలోపడ్డ శకుంతలా! ఎవరైనా దుష్యంతుడు ఎదురుపడ్డాడా?' అని కుశలప్రశ్న వేసింది. **అట్నుంచి** జవాబు రాలేదు.

'మరేం భయపడకు! నీ ప్రియుడ్ని నేనేం షేర్ చేసుకోన్లే' అని జోక్ చేసింది. అప్పటికీ రియాక్షన్ లేకపోవ డంతో మూతి ముడుచుకొని.

'పోనీలేమ్మా! ఆ రహస్యం నీలోనే దాచుకోగానీ నీకో లెటరువచ్చింది. ఇదిగో!' —చేతిలోని కవరు వంకా, వెళ్తూన్న కృష్ణవేణివంకా, అర్థంకాని చూపుతో అయోమయంగా మార్చి మార్చి చూసింది జ్యోతి.

లోపలకువెళ్ళి కవరుమీద అడ్రసు చూసింది


విహా అభిమాన హార్వే వస్త్రములను ఎన్నుకొనండి!

హార్వే
ట్విన్ టస్కర్

అత్యధిక నాణ్యతగల వస్త్రములు-పాప్లిన్‌లు, డ్రిల్‌లు, లాంగ్-క్లాత్ మొదలగునవి - సరసమైన ధరకు. ఎన్నో ఉతుకుల అనంతరంకూడా 'కొత్తదనం' అనిపించేలా ఉండేవి గట్టివి, చాలాకాలం మన్నేటటు వంటివి, అద్భుతమైన పనితనము కలిగినట్టివి.




హార్వే
సారాటోగా
'టెరీన్' కాటన్ షర్టింగ్‌లు

ఖచ్చితమైన నేత. అందమైన పని తనము, ఆకర్షణీయమైన అనేక రంగులలో మీకు లభ్యమవుతాయి.



హార్వే
సారాబాండ్
'టెరీన్' కలిసిన సూటింగ్‌లు

పురుషుల అభిరుచికి, ఫాషనుకి ఎప్పుడూ తగినట్టివి. స్వచ్ఛమైన తెలుపునుంచి ఎన్నో రకముల లేత, ముదురు రంగులనుంచి ఎన్నిక చేసుకొనవచ్చును.



తయారుచేయువారు: మధుర మిల్స్ కంపెనీ లిమిటెడ్, మధురై

మధురకు చెందిన హార్వేస్

'మిస్ జ్యోతి బియ్యే, సెకండియర్, ప్రెసెన్స్ కాలేజీ' అనివుంది కవరుమీద.

క్లాసుకీ, కాలేజీకికూడా తనొక్కర్తే జ్యోతి. ఏదో ఆలోచనరాగా అక్కడవున్న బల్లమీద కూర్చుని వణుకుతూన్న చేతుల్తో కవరు చించింది.

'కుమారి జ్యోతిగార్కి!'

ఆనందంతో గుండె ఆగిపోయినంత పనైంది. మూలనున్న కూజాలోని నీళ్ళు గ్లాసులోకి వంచుకొని ఒక్కగుక్కలో త్రాగింది ముఖంమీద పట్టిన చెమట తుడుచుకొంటూ లెటరుపైకి దృష్టి సాగించింది.

'వస్తానని చెప్పి రానందుకు — మీకు నామీద కోపం వచ్చిందనుకొంటాను. రావడానికి వీలులేక పోవడంతో ప్రయత్నించి కూడా మిమ్మల్ని కలవలేకపోయాను దురదృష్టవంతుణ్ణి. చిన్నప్పటినుండి నాజీవితంలో జరిగిన ప్రతి ముఖ్యమైన సంఘటనా నా ప్రమేయం లేకుండానే జరుగుతూ వచ్చింది. అన్నిటా అపజయమే ఎదురవుతోంది— మీ విషయంలో కూడా నన్ను అపజయం పొందనివ్వకండి. అలా జరిగితే... నేనేమవుతానో నాకే తెలీదు. చెప్పాలనుకొన్నదీ, చెప్పాలన్నదీ మీతో చెప్పనేలేదు. మీకు ఆ విషయం చెప్పాలి— మీ నుండి జవాబు వినాలి— రేపు మధ్యాహ్నం మెయిల్‌కి వెళ్తున్నాను. తప్పక స్టేషనుకు వస్తారు కదూ! నన్ను నిరాశపరచరనే నమ్మకం నాకుంది. ఏమిటంత నమ్మకం అనడిగితే నేనేమీ చెప్పలేక పోవచ్చు. కాని మిమ్మల్ని చూసిన మొదటి క్షణంలో అదివరకు ఎక్కడో చూసినట్లు అనుభూతి పొందాను

# నీలిరుమాలు

ఎంత ఆలోచించినా గుర్తు రాలేదు. మళ్ళీ అదృష్టవశాత్తూ మిమ్మల్ని రెండోసారి కలుసుకొనే యోగం పట్టింది. అప్పుడూ అలానే ఫీలయ్యాను, కానీ మొదటిసారి మిమ్మల్ని ఎక్కడ కలుసుకున్నానో కొద్దిగా గ్రహించాను. వయస్సు వచ్చిందగ్గర్నించీ నేను కన్న ప్రతికలలోనూ మీరే వున్నారు. అతిశయోక్తిగా కన్పించినా అసంభవమేమీకాదు. పూర్వజన్మలమీదా పునర్జన్మలమీదా నాకు యింతవరకూ నమ్మకం లేదు. కానీ మిమ్మల్ని చూసింతర్వాత నాలోకలిగిన అనుభూతుల్ని, ఆవేదననూ బట్టి ఆలోచిస్తే జన్మజన్మల సంబంధాల సంగతి బొత్తిగా కొట్టిపారేయవలసిన విషయంలా తోచడం లేదు.

మీకై వేయికళ్ళలో ఎదురుచూస్తూ

మీ

ప్రసాద్.

తలనిండా ఆలోచనలు నిండగా తొందరగా యింటికి వెళ్ళింది జ్యోతి. స్టేషనుకు వెళ్ళడమా మానడమా! మనస్సు సందిగ్ధావస్థలో పడింది. ఎంత ఆలోచించినా ఓ నిర్ణయానికి రాలేకపోయింది. 'అతను తనతో ఆడుకోవడంలేదుకదా!' ఉత్తరంలోని ప్రతిఅక్షరమూ తన అనుమానాలు అబద్ధమని నొక్కిచెబుతున్నాయి. నిజం! అతను ఒకరిచేత మోసగించబడేవాడిలానే వున్నాడు కానీ మోసగించేవాడిలా లేడు. ఆ ఒకరు తనుమాత్రం కాకూడదు. అతను తనవారు. తను వెళ్ళాలి. వెళ్ళితీరాలి—అతను తనకోసం ప్లాట్‌ఫారమంతా వేయికళ్ళతో వెదుకుతూ వుంటాడు. తను కనిపించకపోతే అతని అందమైన మోము చిన్నబోతుంది. అతనికళ్ళలో నిస్పృహ నీడలు పరుచుకొంటుంది. అతనిని నిరాశపరచి తను నిరాశపడకూడదు.'

టైము చూసుకొంది. గుండెలు వేగంగా కొట్టుకున్నాయి. ట్రైనుకి ఆట్టే వ్యవధిలేదు ఆలోచించడానికి యిది సమయమూ కాదు. దృఢనిశ్చయానికి వచ్చిన జ్యోతి చీరె మార్చుకొని తొందరగా ముస్తాబై రిక్షా ఎక్కింది.

'బండి కూసనాదిలేసే టయిమయిందమ్మాయిగోరూ!' రిక్షావాడి మాటలతో మనస్సు మరీ అలిసిపోయింది. రిక్షానుండి దిగి పరిగెట్టాలనిపించింది జ్యోతికి.

స్టేషన్ను సమీపించిన రిక్షా పూర్తిగా ఆగకముందే రిక్షాదిగిన జ్యోతి కాళ్ళు ట్రైనువైపు పరుగుదీశాయి. మెల్లగా కదులుతోన్న రైలునిచూసి 'ప్రసాద్!' అని పిచ్చిగా అరవబోయింది. జనాన్ని త్రోసుకుంటూ తడబడుతున్న అడుగులతో ముందుకు నడిచింది.

వేగం అందుకొంటూన్న రైల్లో ఫర్స్ట్ క్లాస్ కంపార్ట్‌మెంట్‌లో కిటికీ ప్రక్కనే కూర్చునివున్న ప్రసాద్ చూపులు ప్లాట్‌ఫారం మీదపరిగెడుతూ దూరానకన్పించిన జ్యోతిని చూసి ఆగిపోయాయి. నుదుటిమీద రెండు ముడుతలు పడ్డాయి. వాడిన పెదాలపై అర్థంలేని చిర్నవ్వు మెరిసింది. కర్చీఫ్ పైకితీసి వూపాడు.

నిరాశ బరువుతో క్రిందకు వాలుతోన్న జ్యోతి కళ్ళకు, దూరంగా, గాలిలో రెపరెపలాడుతోన్న బ్లూ హేంకీ కన్పించింది. అప్రయత్నంగా తనుకూడా చేయి పైకెత్తి వూపుతూ, ఆ రుమాల్ని పట్టుకున్న చేతి యజమాన్ని చూడాలని ప్రయత్నించింది. ఎవరో అడ్డువచ్చారు. నిస్పృహతో జ్యోతి శిలైపోయింది.

దూరంగా రెప రెప లాడుతోన్న బ్లూహేంకీ కన్నీటి తెరలమాటున గాలిలో దీపంలా అదృశ్యమౌతూ కన్పించింది.

రు. 20,000 లు
కోట్ క్విజ్ నెం. 15
నందు మీరు తప్పకుండా గెలుపొందండి
15 క్లూలు మాత్రమే!
పూర్తి వివరాలకు, కోట్ క్విజ్ వీక్లి ఉచిత కాపీకి నేడే వ్రాయండి.
QUOTEQUIZ (P) LTD., BOMBAY-19. DD